సాక్షి చిత్తూరు

సోమవారం । 11 । ఆగస్టు । 2025



భవితకు విజ్ఞాన్ మంథన్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞాన్ మంథన్ పరీక్ష నిర్వహిస్తోంది - 8లో



ఫార్మసిస్టుల కొరత

జిల్లా ఆస్పత్రిలో అవసరమైన మేర ఫార్మసిస్టులు లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. - 8లో



చెట్లు అడ్డుగా ఉన్నాయట..!

వరుస సెలవులు రావడంతో గుడిపాల మండలం చీలాపల్లె స్కూల్లోని భారీ చెట్లను కొందరు నరికేసి కలపను తరలించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోలీసుశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే ఉదయం 10.30 నుంచి వినతులు, ఫిర్యాదులు అందించవచ్చని పేర్కొంది.

నేడు పులిచెర్లలో పీజీఆర్‌ఎస్

చిత్తూరు కలెక్టరేట్/రొంపిచెర్ల: ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 11న పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్ల మండలంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులిచెర్ల మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి పీజీఆర్‌ఎస్ కార్యక్రమం పులిచెర్ల మండలంలో నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

కాణిపాకంలో పలువురు ప్రముఖులు



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక విచ్చేశారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందించి.. తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే తిరుపతి తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి కూడా స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది వాసు, చిట్టిబాబు, ఎస్‌ఐ నరసింహులు పాల్గొన్నారు.

అయ్యో.. దేవుడా!

దేవదాయశాఖలో గందరగోళం నెలకొంది. ఆడిట్ల పర్వం అడ్డగోలుగా మారుతోంది. పలువురు ఆడిటర్లు సవాలక్ష కుంటిసాకులు చెప్పి దోపిడీపర్వానికి దిగుతున్నారు. ప్రీ ఆడిట్, వార్షిక ఆడిట్ చేసేటప్పుడు వారు అడిగింది ఇస్తేనే బిల్లులు పాస్ చేస్తున్నారు. లేకపోతే పెండింగ్ పెడుతున్నారని ఈవోలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రీ ఆడిట్ విధానంలో బిల్లుల అనుమతులకు ఆలస్యమవుతున్నట్టు పేర్కొంటున్నారు. మరోవైపు ఆడిట్‌లో బిల్లుల గోల్‌మాల్ బయటపడుతుండడంతో ఆడిట్ అధికారులు లోతుగా విచారించేందుకు సిద్ధమవుతున్నారు.



కాణిపాకం దేవస్థానం



జిల్లా దేవదాయశాఖలో ఆడిట్ గోల్‌మాల్

- దోపిడీ పర్వానికి దిగుతున్న ఆడిటర్లు
- కమీషన్లు ఇవ్వకుంటే బిల్లులు పెండింగ్
- లబోదిబోమంటున్న ఈఓలు
- పట్టించుకోని దేవదాయశాఖ ఉన్నతాధికారులు

కాణిపాకం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 6ఏ కింద కాణిపాకం, శ్రీకాళహస్తి, బోయకొండ గంగమ్మ, సురుట్టుపల్లిలోని పళ్లికొండేశ్వరస్వామి దేవస్థానం, చంద్రగిరి మూలస్థానమ్మ, తలకోన సిద్దేశ్వరస్వామి, నగరిలోని దేసమ్మ దేవస్థానం, అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానాలున్నాయి. వీటి నిర్వహణకు సంబంధించి అప్పటికప్పుడు బిల్లులు ప్రీ ఆడిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే బిల్లులు మంజూరవుతుంటాయి.

పారదర్శకతకు ప్రీ ఆడిట్

ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండేందుకు గత ప్రభుత్వం ప్రీ ఆడిట్ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రతి నిర్వహణకు సంబంధించిన బిల్లులు పక్కాగా ఉండాలి. సంబంధిత విభాగ అధికారులు అనుమతి ఉండాలి. అలాగే ఆ శాఖ అధికారి అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాతే ప్రీ ఆడిట్‌కు సమర్పించాలి. వీటిని ఆడిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఆమోదం ఉంటుంది. పరిశీలనలో తప్పిదాలు కనిపిస్తే తిరస్కరించవచ్చు.

చేయి తడిపితే చాలు!

ఆడిటర్లు ప్రీ ఆడిట్ విధానాన్ని కల్పతరువుగా మార్చుకుంటున్నారు. బిల్లులు ప్రీ ఆడిట్‌కు వెళ్లిన ప్రతిసారీ ఆమ్యామ్యాలు చెల్లిస్తేనే వారు బిల్లులు పాస్ చేస్తున్నారని, లేదంటే పెండింగ్ పెట్టి ఇబ్బంది పెడుతున్నారని పలువురు ఈవోలు ఆరోపిస్తున్నారు. ప్రీ ఆడిట్లో ఏదో తంటాలు పడి బిల్లులు పాస్ చేయించుకుంటే వార్షిక ఆడిట్‌లో మళ్లీ మొదటికి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రీ ఆడిట్ పాస్ అయిన బిల్లులు వార్షిక ఆడిట్లో ఎందుకు పాస్ కావడం లేదంటే మళ్లీ అదే బిల్లులకు సంబంధించి ఆడిటర్లకు అడిగింది సమర్పిస్తేనే పాస్ అవుతున్నాయన్నది సమాచారం.

మామూళ్ల తలనొప్పి

ప్రీ ఆడిట్లో ఆడిటర్లకు మామూళ్లు ఇచ్చి మళ్లీ వార్షిక ఆడిట్లో ఆడిట్ క్లియర్ చేసుకునేందుకు మళ్లీ మామూళ్లు ఇవ్వాల్సి రావడం తలకు మించిన భారంగా ఉందని ఈవోలు ఆరోపిస్తున్నారు. ప్రీ ఆడిట్లో అనుమతి ఇచ్చిన ఆడిటర్లు వార్షిక ఆడిట్లో అభ్యంతరం వ్యక్తం చేయడం ఆ శాఖ అధికారుల అవినీతికి పరాకాష్టగా ఉందని ఈవోలు చెబుతున్నారు. ఇదేవిషయాన్ని దేవదాయశాఖ ఈవోల సంఘం ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. ప్రీ ఆడిట్ చేసి అనుమతిచ్చిన తర్వాత నిజంగా ఆ వ్యయం సరైనది కాదని భావించి వార్షిక ఆడిట్లో అభ్యంతరం వస్తే వాటిపై ప్రీ ఆడిట్ చేసిన వారిని బాధ్యులను చేసి చర్యలు తీసుకోవాల్సిన ఆడిట్‌శాఖ రాష్ట్ర అధికారులు అవేమీ పట్టించుకోకుండా తమను బాధ్యులను చేయడం ఏమిటని ఈవోలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై సత్వర చర్యలు తీసుకుని ఆడిటర్ల ధనదాహానికి అడ్డుకట్ట వేయాలని ఈవోలు కోరుతున్నారు.

కొర్రీలు పెడుతున్నారు

ప్రీ ఆడిట్‌కు వెళ్లినప్పుడు ఎలాంటి కారణాలు లేకుండానే బిల్లులు పెండింగ్ పెడుతున్నారు. వాస్తవానికి వాటిపై అనుమానాలు ఉంటే వెనక్కి కానీ తమ వద్దే ఆ బిల్లులు పెట్టుకుంటూ ఈవోలను పీడిస్తున్నారు. వారు అడిగింది సమర్పిస్తేనే బిల్లులు పాస్ చేస్తున్నారని ఈవోలు చెబుతున్నారు. దీనివల్ల బిల్లులు పెట్టిన ప్రతిసారీ డబ్బులు చెల్లించాల్సి రావడంతో అప్పులపాలవుతున్నామని వివిధ ఆలయాల అధికారులు వాపోతున్నారు.

ఆడిటర్ల వాదన ఇలా..

పలువురు ఆడిట్ అధికారులు ఆలయ అధికారులు ఇచ్చే బిల్లుల్లో గోల్‌మాల్ ఉంటోందని ఆరోపిస్తున్నారు. వాటి లెక్క తేలిస్తే తమను తప్పుబడుతున్నారని వాపోతున్నారు. బిల్లులు లేవని తిరస్కరిస్తే తప్పు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. బిల్లులు చూస్తే... చేసేది గోరంతా..చూపేది కొండంత అన్న చందంగా ఉందని బహిరంగంగా చెబుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ఆలయ కేటగిరీ	సంఖ్య
6ఏ	9
6బీ	47
6సీ	3,130
6డీ(మఠాలు)	33

భూముల వివరాలు

బీడు భూములు –	4,801.11 ఎకరాలు
వ్యవసాయ భూమి –	14,987.20 ఎకరాలు
ఇతర భూమి –	4,610.21 ఎకరాలు
మొత్తం –	24,398.52



మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని గ్రామ సమీపంలోని చప్పిడిపల్లి గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ నేతలు జే అమరనాథ రెడ్డి, మనోజ్‌రెడ్డి, మునిత్నం నాయుడు, రమేష్‌రెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్టహాసంగా అగ్నిగుండ ప్రవేశం

- కల్పవృక్షం, సూర్యప్రభ వాహనాలపై విహరించిన ద్రౌపదీదేవి
- బ్రహ్మోత్సవాలకు బ్రహ్మరథం పట్టిన భక్తజనం





కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న ద్రౌపదీ సమేత అర్జునస్వామి, అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

పుత్తూరు: శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం చివరి ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశం అట్టహాసంగా జరిగింది. సుమారు 3 వేల మంది భక్తులు ప్రవేశించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. ద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వాములను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 8 గంటలకు విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కల్పవృక్ష వాహనంపై శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జునస్వాముల వారు పట్టణ పురవీధుల్లో విహరించారు. 10 గంటలకు రజక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం కోసం భక్తులు ఆలయం వద్ద కంకణాలు ధరించారు. మగవారితో పాటు మహిళలు సైతం అగ్నిగుండ ప్రవేశం చేయడం విశేషం. కంకణదారులైన భక్తులు 9 బావుల్లో స్నానాలు ఆచరించి చివరగా మంచినీళ్ల గుంట వద్దకు చేరుకున్నారు. అక్కడ మగవారు పసుపు పంచె, మహిళలు పసుపు చీరతో పాటు తలకు పూలు చుట్టుకుని ముస్తాబయ్యారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు బాబు ముందుగా అగ్నిగుండం నుంచి నిప్పును తీసి అమ్మవారి పైటకొంగులో వేశారు. పూలబంతిని అగ్నిగుండంలో వేసి భక్తులను అగ్నిగుండంలోకి అనుమతించారు. గోవిందనామ స్మరణలతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. కార్యక్రమాలు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. అగ్నిగుండ ప్రవేశం పూర్తయిన అనంతరం ఆలయంలోని అలుగు కుంభాగ్రహం నుంచి కత్తి పరిగ్రహించబడింది. రాత్రి 9 గంటలకు స్థానిక ఆర్టీసీ డిపో వారి ఆధ్వర్యంలో సూర్యప్రభ వాహనంపై శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జునస్వామి పట్టణ పురవీధుల్లో విహరించారు. అగ్నిగుండ ప్రవేశ ఘట్టాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పుత్తూరు పట్టణం భక్తజనంతో కిక్కిరిసిపోయింది.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

సోమవారం ఉదయం 7 గంటలకు అగ్నిగుండం శాంతి పూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి వసంతోత్సవం, రాత్రి 9 గంటలకు ధ్వజావరోహణం ఉంటుంది.

కిక్కు పర్మినెంట్!



తవణంపల్లి మండలం, అరగొండ వద్ద ఉన్న మద్యం దుకాణం.. పక్కనే పర్మిట్ గదిలో మందు బాబులు

- కాసులు కురిపించే కల్పవృక్షంగా మద్యం దుకాణాలు
- విచ్చలవిడి అమ్మకాలు.. అనధికార పర్మిట్ గదులు
- 'పర్మిట్'లో పచ్చ నేతలు, ఖాకీలకు నెలవారి మామూళ్లు
- రూ.కోట్లు కురిపిస్తున్న 'ప్రైవేటు' మద్యం అమ్మకాలు

చిత్తూరు అర్బన్: తొమ్మిది నెలలు నిండాయి. కాన్పుకు కాదు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చి. నెలలు నిండిన బిడ్డ ఆరోగ్యంగా ఉందా..? ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా..? అని చూడాలి కదా. జిల్లాలో అమలవుతున్న నూతన మద్యం పాలసీ పరిశీలిస్తే.. కేవలం పచ్చ నేతలకు నెలవారి తాయిలాలు, ఆబ్కారీలోని కొందరు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోందనడంలో సందేహం లేదు.

అందరూ వాళ్లే..

జిల్లాలో గతేడాది అక్టోబర్ 15 నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. అప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు వ్యక్తులకు లైసెన్సులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాగినోడికి తాగినంత అనే నినాదంతో ముందుకు వెళుతోంది. చిత్తూరు జిల్లాలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ పరిధిలో ఎనిమిది సర్కిల్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో అన్-రిజర్వుడు కింద 104 మద్యం దుకాణాలు, కల్లుగీత సామాజిక వర్గాలకు 9 మద్యం దుకాణాలు చొప్పున లైసెన్సులు జారీఅయ్యాయి. మద్యం దుకాణాల లైసెన్సులు దక్కించుకున్న వారిలో దాదాపు అధికార పార్టీకి చెందిన నాయకులు, సానుభూతిపరులే ఉన్నారు. ఒకరిద్దరు బయటివాళ్లకు లైసెన్సులు వచ్చినా.. వాళ్లను ఇబ్బందులు పెట్టిన నాయకులు, దారిలోకి తెచ్చుకుని అమ్మకాల్లో వాటాలు తీసుకుంటున్నారు.

ఎవరి వాటా వాళ్లదే!

పర్మిట్ గదులు వెలసినచోట.. మరే వ్యాపారం చేయడానికి వీలుండదు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు నిత్యం గొడవలు పడడం, తాగి అక్కడే వాంతులు చేసుకోవడం, పడిపోవడం సర్వసాధారణం. ప్రతీ పర్మిట్ గదికి ఎక్సైజ్, ఖాకీలు కప్పం వసూలు చేస్తున్నారు. ఈ కప్పంలో ఎక్సైజ్ అధికారులు ఒక్కో దుకాణానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూతలపట్టులోని ఓ అధికారికి నెలవారీ మామూళ్లు రాకపోవడంతో రెండు పర్మిట్ గదులు మూయించడంతో, తీవ్ర కోపానికి లోనైన ఓ నేత ఆ అధికారికి చీవాట్లు పెట్టడంతో మళ్లీ అవి తెరుచుకున్నాయనే పుకార్లు వినిపిస్తున్నాయి. ఇదికాదన్నట్లు మద్యం దుకాణాలున్న నియోజకవర్గంలో వాటి యజమానులు ఇష్టం ఉన్నా, లేకున్నా పచ్చ నేతలను వాటాదారుడిగా చేర్చుకోవాల్సిందే. వ్యాపారంలో ఎలాంటి పెట్టుబడి పెట్టని కూటమి నేతలు 5 నుంచి 7 శాతం వరకు.. అంటే నెలకు రూ.8 కోట్ల పైనే లాభాలు ఆర్జిస్తున్నారన్న మాట.

జిల్లాలో మద్యం దుకాణాలు, విక్రయాలు

మద్యం దుకాణాలు –	104
కల్లుగీత మద్యం దుకాణాలు –	09
అనుమతుల్లేని పర్మిట్ గదులు –	350పై చిలుకు
మద్యం విక్రయాలు (నెలకు) –	రూ.124.20 కోట్లు
పర్మిట్ గదుల్లో వ్యాపారం (నెలకు) –	రూ.10.50 కోట్లు
మొత్తంగా వచ్చే లాభాలు (నెలకు) –	రూ.20.26 కోట్లు
అధికారులకు అందుతున్న మామూళ్లు –	రూ.2 కోట్లకు పైగా
నేతలకు ఇచ్చే నెలవారి వాటా –	రూ.8.12 కోట్లు

పర్మిట్ గదులతో కిక్కు

మద్యం దుకాణాలకు మాత్రం ప్రభుత్వమే లైసెన్సులు జారీచేసింది. కానీ జిల్లాలో ప్రతీఒక్క మద్యం దుకాణానికి పక్కనే అనధికారిక పర్మిట్ గదులు ఉన్నాయి. మద్యం తీసుకున్న వ్యక్తి ఆ గదిలోకి వెళ్లి మద్యం సేవించడం, గ్లాసులు, కూల్ డ్రింకులు, స్టఫ్, సిగరెట్లు.. ఇలా ఓ మినీ సూపర్ మార్కెట్ పర్మిట్ గదుల్లో నడుస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న పర్మిట్ గదుల్లో రోజుకు సగటున రూ.30 వేలకు పైనే వ్యాపారం జరుగుతోంది. బార్లకు సమాంతరంగా ఉన్న పర్మిట్ గదులు నాయకులకు, ఎక్సైజ్, పోలీసు అధికారులకు మామూళ్ల వర్షం కురిపిస్తోంది. ఇక గ్రామాల్లోని పర్మిట్ గదుల్లో సగటున రూ.10 వేల వరకు వ్యాపారం జరుగుతోంది. జిల్లా మొత్తంగా ఉన్న మద్యం దుకాణాల వద్ద 350 వరకు పర్మిట్ గదులు ఉంటే.. నెలకు రూ.కోటికి పైగా వ్యాపారం ఇక్కడే జరుగుతోంది. ఇక మద్యం దుకాణాల్లో సగటున రోజుకు రూ.కోటి పైనే అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ రెండింటి నుంచే నెలకు దాదాపు రూ.20 కోట్లకు పైనే లాభాలు వస్తున్నాయి.



కుప్పం పట్టణంలో ఓ మద్యం దుకాణం వద్ద పర్మిట్ గదికి అడ్డుగా పెట్టిన రేకులు



జీడీ నెల్లూరులో భారీ వర్షం

జిల్లాను వీడని వర్షాలు

- ఐదురోజులుగా ఎడతెరిపి లేని వాన
- పలుచోట్ల భారీ వర్షం..కొన్నిచోట్ల తుంపర్లు
- వాగులు.. వంకల్లో నీరు
- సాగులో ఉన్న పంటలకు దెబ్బ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో ఐదు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు పడుతున్నాయి. ఆదివారం కూడా జిల్లా లో పలుచోట్ల భారీ వర్షం పడగా.. కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసింది. చిత్తూరులో మాత్రం బలమైన వర్షం పడింది. పూతలపట్టులో పలుచోట్ల మోస్తారు వర్షం కురిసింది. పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి నియోజకవర్గాల్లో తేలికపాటి వర్షం పడింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొన్నిచోట్ల వాగులు, వంకలు ప్రమాదకరంగా మార దంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. చెరువులకు సైతం వర్షపు నీరు చేరుతోంది. పంట పొలాలు వర్షపు నీటితో తడిసి ముద్దవుతున్నాయి. వరి పంట నేలకొరుగుతోంది. పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో సాగులో ఉన్న టమాటాపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపనున్నాయి. కాయలపై నల్లమచ్చలు పడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కూరగాయ పంటలు, మల్బరీ సాగుకు నష్టాలు వాటిల్లే అవకాశం ఉందని వాపోతున్నారు.



పొంగిన బొమ్మవారిపల్లి వంక

ప్రహసనంగా ఎఫ్‌ఏ-1 పరీక్షల విధానం


రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : అన్ని విద్యాసంస్థల్లో జరుగుతున్న ఎఫ్‌ఏ-1 పరీక్షల విధానంలో పలు మార్పులు ముఖ్యమని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం నుంచి జరగనున్న ఎఫ్‌ఏ-1 పరీక్షలు ఉపాధ్యాయులకు, అటు విద్యార్థులకు ఓ పరీక్షగా మారిందని విమర్శించారు. ఇంతవరకు నూతన పరీక్ష విధానం పట్ల ఏ అధికారి నేటి వరకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించలేదని తెలిపారు. మండల కేంద్రం నుంచి ఉపాధ్యాయులు అసెస్‌మెంట్ పుస్తకాలు తెచ్చుకోవడం ఓ పరీక్ష అయితే, ప్రతిరోజూ పరీక్ష పత్రాలు తెచ్చుకోవడం మరో పరీక్ష అని దుయ్యబట్టారు. ప్రపంచ బ్యాంకు నిధుల కోసం కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను భయాందోళనలకు ఇలా గురిచేస్తోందని వాపోయారు. కూటమి ప్రభుత్వం ఉపయోగపడని విద్యా విధానాలను, పరీక్షా విధానాలను తక్షణమే ఉపసంహరించుకుని.. విద్యార్థులకు స్వేచ్ఛ ఉండేలా మార్పులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమేనని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శులు వాడ గంగరాజు, బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకే ఈ క్రీడాపోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు ఇస్తామన్నారు. జిల్లాకేంద్రంలోని పలు స్కూళ్ల వద్ద గుట్కా, మత్తుపదార్థాలు విక్రయాలు జరుగుతున్నాయని, పోలీసులు నిఘా పెట్టి నియంత్రించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ మసూద్, నాయకులు దిలీప్, నిసాద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజూ ఆగని ఏనుగుల దాడులు


మిట్టమీద రాచపల్లెలో ఏనుగుల దాడిలో ధ్వంసమైన కొబ్బరి చెట్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఏనుగుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. వరుసగా నాలుగో రోజు కూడా పంటలను సర్వనాశనం చేశాయి. ఆదివారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు మిట్టమీద రాచపల్లె పంచాయతీలో పంటలను తొక్కి పడేశాయి. పురుషోత్తం రెడ్డికి చెందిన కొబ్బరి చెట్లను పూర్తిగా ధ్వంసం చేశాయి. అలాగే మామిడి కొమ్మలను విరిచేశాయి.

ఏనుగుల దాడిలో టమాట పంట ధ్వంసం

ఐరాల: మండలంలో రెండు ఏనుగులు మళ్లీ విజృంభించాయి. శనివారం అర్ధరాత్రి నయనంపల్లెకు చెందిన రైతులు చిన్నయ్య, రాఘవయ్యకు చెందిన టమాట పంటలను ధ్వంసం చేశాయి. అపోలో వారికి చెందిన నాలుగు రాతికూసాలను కూలదోశాయి. అటవీ అధికారులు ఇకనైనా ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కరుణించమ్మ.. గంగమ్మ..


బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లి: జిల్లాలో రెండో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల భక్తులు కరుణించమ్మ.. గంగమ్మా అంటూ అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రావణ మాసం సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలతో గంగమ్మకు పూజలు చేశారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి తెలుగుభాషా పోటీలు

పలమనేరు: వచ్చే తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు జాతీయస్థాయి తెలుగుభాషా పోటీలను నిర్వహించనున్నట్లు తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు అమృతభాష అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి ఈనెల 20వ తేదీలోపు కళామందిరం, గంగవరం, 517408 అనే చిరునామాకు తపాలా ద్వారా మాత్రమే పంపాలని సూచించారు.

విద్యార్థి భవితకు విజ్ఞాన్ మంథన్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞాన మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషన్ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహకాలు, దేశంలో సీఎస్ఐఆర్, ఐఎస్ఆర్ఓ, బార్క్, డీఆర్‌డీఓ ప్రముఖ జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను చూసే అవకాశం, ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఈ వీవీఎం పట్ల జిల్లాలోని క్షేత్రస్థాయి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

- విజ్ఞాన మంథన్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ అధికారులు
- 6 నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ వరకు అవకాశం
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష లోగో

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగిన సృజనాత్మకత ఆలోచనలు, ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఎన్‌సీఈఆర్‌టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరిట జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు చదివే వారికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి భారత దేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది. ఇందుకు గానూ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబరు 30వతేదీ వరకు గడువు ఉంటుంది. ఆన్‌లైన్‌లో పాఠశాల స్థాయిలో పరీక్ష జరుగుతుంది. 6వ తరగతి నుంచి 11(ఇంటర్ మొదటి సంవత్సరం)తరగతుల వరకు విడివిడిగా ఈ పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నారు.

వంద మార్కులకు పరీక్ష

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్షలను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి ప్రధాన పరీక్ష అక్టోబరు 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి సెకండ్ లెవెల్(ద్వితీయ పరీక్ష) పరీక్ష ఆన్‌లైన్‌లో ప్రోక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబర్ 19వ తేదీన ఉంటుంది.

కేంద్ర సంస్థల ఆధ్వర్యంలో..

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్, శాస్త్ర, సాంకేతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ పరీక్షను ఏటా నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

జాతీయస్థాయికి ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి విజేతల్లో ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు నెలకు రూ.2000 చొప్పున సంవత్సరం పాటు భాస్కర ఉపకార వేతనం అందజేస్తారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1 నుంచి 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

జిల్లాలోని స్కూళ్లు, కళాశాలల సమాచారం

కేటగిరీ	స్కూళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	4,247	59,067
ప్రాథమికోన్నత	738	42,380
ఉన్నత	1,203	30,307
జూనియర్ కళాశాలలు	238	27,700
మొత్తం	6,426	1,59,454

సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావొచ్చు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పెంచుకునేందుకు ఈ పరీక్ష ఎంతో దోహద పడుతుంది. పరీక్ష వల్ల కలిగే ఉపయోగాలపై జిల్లాలో అవగాహన కల్పిస్తున్నాం. – బి.హిమబిందు, విద్యార్థి విజ్ఞాన్ మంథన్ జిల్లా కోఆర్డినేటర్, చిత్తూరు

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం

ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షల్లో పాల్గొనేలా హెచ్ఎంలు కృషి చేయాలి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైతే స్కాలర్‌షిప్‌తో పాటు ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉంటుంది. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు వీవీఎం పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు జిల్లా.

వైఎస్సార్‌సీపీలో చేరిన తెలుగు తమ్ముళ్లు


చౌడేపల్లె : సింగిరిగుంటలో టీడీపీ నుంచి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలు

- కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి
- సింగిరిగుంటలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం
- పార్టీలో చేరిన ఆరుగురిలో ముగ్గురికి మళ్లీ కండువా వేసిన టీడీపీ నేతలు


టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో మళ్లీ పచ్చకండువా కప్పుకున్న ముగ్గురు

చౌడేపల్లె: తెలుగుదేశం పార్టీకి చెందిన ఆరుగురు కార్యకర్తలు ఆదివారం చౌడేపల్లె మండలం సింగిరిగుంటలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం పాలన నచ్చక వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. సింగిరిగుంటకు చెందిన ఎం.ప్రకాష్‌నాయుడు, పి.చెన్నకృష్ణ, పి.నగేష్, కె.రాజశేఖర్‌నాయుడు, నుంజార్లపల్లెకు చెందిన పి.నాగరాజనాయుడు, రామయ్యగట్లుకు చెందిన డి.సుజాత వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు దామోదరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచ్ షంషీర్, నాయకులు చెంగారెడ్డి, రమేష్‌నాయుడు, మల్లీశ్వరరెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, నాగరాజ, హరి, రమేష్‌బాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

కుట్రలకు తెరలేపిన వైనం..

సింగిరిగుంటలో ఉదయం సుమారు 9 గంటల ప్రాంతంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తలు చేరిన విషయం తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు కుట్రలకు తెరలేపారు. పార్టీని విడిచిన కె.రాజశేఖర్‌నాయుడు, పి.నగేష్, పి.నాగరాజ నాయుడుతో చర్చలు జరిపారు. పుంగనూరు పర్యటన ముగించుకుని మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో రొంపిచెర్లకు వెళ్తున్న చల్లా రామచంద్రారెడ్డి చేత స్థానిక నేతలు మళ్లీ టీడీపీ కండువా వేసి ఆ పార్టీలోకి పిలుచుకున్నారు.

జ్యోతిష్యం చెబుతానని చెప్పి..

– మహిళ మెడలో నగలు ఎత్తుకెళ్లిన దుండగుడు


బాధితురాలు లక్ష్మమ్మ

బైరెడ్డిపల్లె: గుర్తు తెలియని వ్యక్తి ఓంశక్తి మాల ధరించి ఓ వృద్ధురాలి వద్ద నగలు దోచికెళ్లిన సంఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లెలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు..నాగిరెడ్డిపల్లెకు చెందిన లక్ష్మమ్మ ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఓంశక్తి మాల ధరించి అక్కడకు చేరుకున్నాడు. లక్ష్మమ్మ పలకరించగా తాను జ్యోతిష్యం చెబుతానని, కష్టాలు ఉంటే పోగొడతానని నమ్మించాడు. ఇసుక గ్లాసులో తీసుకువచ్చి అందులో నీరు, పసుపు కలపమని చెప్పాడు. ఇసుక తీసుకొచ్చి నీరు, పసుపు కలుపుతున్న సమయంలో లక్ష్మమ్మపై మత్తు మందు చల్లి సుమారు రూ.2 లక్షలు విలువ చేసే నగలను దోచుకెళ్లాడు. ఈ విషయంపై బాధితురాలు బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జిల్లా చెస్ పోటీల్లో అర్జున్ ప్రతిభ


న్యూయార్క్ విద్యార్థి అర్జున్‌ను అభినందిస్తున్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్: నగరిలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో చిత్తూరు నగరానికి చెందిన న్యూయార్క్ స్కూల్ విద్యార్థి అర్జున్ 2వ బహుమతి గెలుపొందాడని ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నగరి, నగరి చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 250 క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో పాల్గొని రెండవ స్థానాన్ని కైవసం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని న్యూయార్క్ స్కూల్ చైర్మన్ శ్రీధర్ అన్నారు. అనంతరం అతన్ని పలువురు అభినందించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత !

పూతలపట్టు(యాదమరి): జిల్లాలో మత్తు పదార్థాలకు నిలయమైన పూతలపట్టు మండలం బండపల్లిలో గంజాయి విక్రయదారుడిని పూతలపట్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థకు చెందిన కొందరు విద్యార్థులు నిత్యం గంజాయి కోసం బండపల్లిలోని ఓ గంజాయి స్మగ్లర్ రహస్య స్థావరానికి వచ్చినట్లు సమాచారం. అయితే ఆదివారం కాలేజీలకు సెలవు కావడంతో మత్తుకు బానిసైన విద్యార్థులు అధికంగా వచ్చారు. సరఫరాదారు వద్ద అవసరానికి తగ్గ గంజాయి లేకపోవడంతో.. రెగ్యులర్ వినియోగదారులకు తప్ప కొత్తగా వచ్చిన వారికి ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన కొందరు విద్యార్థులు సరఫరాదారులపై వాగ్వాదానికి దిగారు. కాగా అక్కడ జరిగిన అవమానానికి ప్రతీకారంగా ఓ విద్యార్థి పూతలపట్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దాడి చేసి గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతని నుంచి దాదాపు రూ.3000 విలువ చేసే 250 గ్రాముల శీలావతి అనే అత్యంత విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

శభాష్ చిన్నోడా..


పెద్దమారవ చేపను చూపుతున్న సాత్విక్

చౌడేపల్లె: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కుంటలు, వాగుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. ఈ క్రమంలో ఆదివారం నెట్టిబండకు చెందిన రాము కుమారుడు సాత్విక్ పొలం వద్దకు వెళ్తుండగా దేవిరెడ్డి చెరువుకు వర్షపు నీరు వచ్చే వాగులో పెద్దచేపను గుర్తించాడు. సుమారు గంట సేపు కుస్తీ పడి సుమారు 8 కేజీలు ఉన్న పెద్ద మారవ చేపను అతికష్టం మీద పట్టుకున్నాడు. చిన్నారి పొడవంత సైజు గల చేపను పట్టిన విషయం తెలిసిన స్థానికులు పెద్దచేపను చూసేందుకు క్యూకట్టారు.

పీఏసీఎస్‌లకు కమిటీల నియామకం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 5 ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలకు కమిటీలను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీడీనెల్లూరు సొసైటీ చైర్‌పర్సన్‌గా మోహన్‌నాయుడు, సభ్యులుగా జ్యోతి యాదవ్, చవటగుంటకు చైర్‌పర్సన్‌గా బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సభ్యులుగా బీఎం రవి, పి.మనోహర్, పలమనేరుకు చైర్‌పర్సన్‌గా వెంకటరమణ, సభ్యులుగా పాపిరెడ్డి, రమేష్, రొంపిచెర్లకు చైర్‌పర్సన్‌గా రఘునాథరెడ్డి, సభ్యులుగా శివరెడ్డి, సురేంద్ర, తవణంపల్లికి చైర్‌పర్సన్‌గా అమరేంద్ర నాయుడు, సభ్యులుగా మునీంద్ర, భూపతినాయుడుని నియమించింది. వీరు 2026 జనవరి నెలాఖరు వరకు పదవిలో కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మోసాలకు నిలువెత్తు రూపం బాబు


యాదమరి: క్యూర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్

పూతలపట్టు(యాదమరి): మోసాలకు నిలువెత్తు రూపం సీఎం చంద్రబాబు అని.. ప్రజలను వంచించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధి పి.కొత్తకోటలోని శ్రీనివాస కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసమే ఆచరణ సాధ్యం కాని అబద్ధపు హామీలను తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారని చెప్పారు. అధికారం చేపట్టి ఇప్పటికి దాదాపు ఏడాదిన్నర కాలం కావొస్తున్నా ఎన్నికలప్పుడు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలలో ఏ ఒక్కటైనా సక్రమంగా అమలు చేశారా ? అని చంద్రబాబుని ప్రశ్నించారు. సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, ప్రజా సంక్షేమంపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని గతంలో మునుపెన్నడూ చూడలేదని ధ్వజమెత్తారు. కూటమి మోసాలను ప్రజలకు చేరువ చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నాయకులతో కలిసి క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి అమర్‌నాథ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు జయచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు రాజారత్నంరెడ్డి, గౌహతి సుబ్బారెడ్డి, యువత అధ్యక్షుడు నవీన్, బూసిపల్లి రెడ్డెప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఫార్మసిస్టుల కొరత

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఫార్మసిస్టులు (ఫార్మసీ ఆఫీసర్లు) పూర్తిస్థాయిలో లేక పోవడంతో రోగులకు సక్రమంగా సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్న వారిపైనే అధిక భారం పడుతోంది. జిల్లా ఆస్పత్రిలో అందించే సేవలతోపాటు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. రోగులకు చికిత్స అందించే వైద్యుల తర్వాత అంతటి ప్రాధాన్యం ఫార్మసిస్టులకు ఉంది. వైద్యులు రాసి ఇచ్చిన మందులు అందించేది ఫార్మసిస్టులే. అయినా వారిపై ఉన్న పనిభారాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయం.


వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబుకు వినతి చేస్తున్న ఆస్పత్రి వర్గాలు (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రస్తుతం 10 మంది ఫార్మసిస్టులు ఉన్నారు. ఆస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడానికి 25 మంది ఉండాలి. ఇంకా 15 మంది వరకు ఫార్మసిస్టులు అవసరం. పదేళ్ల క్రితం జిల్లా ఆస్పత్రికి 500 నుంచి 600 వరకు ఓపీలు వచ్చేవి. ఇప్పుడు ఓపీల సంఖ్య 1200 వరకు పెరిగింది. ప్రభుత్వం తరపున 450 బెడ్లు, అపోలో తరపున 400 బెడ్లు ఉన్నాయి. ఇన్‌పేషెంట్లు రోజువారీగా 300 నుంచి 350 వరకు ఉంటున్నారు. వీరికి 24 గంటల పాటు ఫార్మసిస్టులు సేవలు అందించాల్సి ఉంటుంది. అయితే ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉన్నవాళ్లపై భారం పడుతోంది.

గత ప్రభుత్వంలో సకాలంలో పోస్టుల భర్తీ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగంలో 50 వేలకు పైగా పోస్టులు భర్తీ చేయడం విశేషం. పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆస్పత్రి వరకు ఏ ఆస్పత్రిలోనైనా పోస్టు ఖాళీ అయితే వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసేవారు. కానీ ఇప్పుడు పోస్టు ఖాళీ అయితే ఏడాదిన్నర అయినా భర్తీ చేసిన దాఖలాలు లేవు.

ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి వెళ్లినా...

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని మే 5న వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు సందర్శించారు. ఆయనకు యూనియన్ నాయకులు ఆస్పత్రి పరిస్థితిని, పోస్టుల భర్తీ ప్రాధాన్యతను వివరించారు. అయినా ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం.

చదువుకోవడానికి చెట్లు అడ్డుగా ఉన్నాయట..!

- గుడిపాల మండలం చీలాపల్లె స్కూల్‌లో భారీ వృక్షాల నరికివేత
- తమకు విషయమే తెలియదంటున్న ఎంఈఓలు
- తహసీల్దార్‌కు ఇచ్చిన అర్జీని సాకుగా చూపి పని కానిచ్చిన ప్రబుద్ధులు


పాఠశాల నుంచి ఈచర్ వాహనంలో ఎక్కిస్తున్న కట్టెల లోడ్

గుడిపాల: ఆ ప్రభుత్వ పాఠశాలలో భారీ వృక్షాలతో ఆహ్లాదం వెల్లివిరిసేది. అయితే ప్రకృతిలో దేన్నీ వదలని కొందరి కన్ను ఆ చెట్లపై కూడా పడింది. సమయం కోసం చాలా రోజులుగా వేచి చూశారు. తాజాగా మూడురోజుల పాటు సెలవులు రావడంతో పని కానిచ్చారు. వివరాలు.. మండలంలోని చీలాపల్లె పాఠశాలలో భారీ వృక్షాలు ఉన్నాయి. అయితే వారి పని కానిచ్చేందుకు పాఠశాల విద్యాకమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి అందులో చెట్లలో ఉన్న కొమ్మలను మాత్రం నరికేందుకు పాఠశాల కమిటీ చైర్మన్, సర్పంచ్, విద్యార్థుల వద్ద సంతకాలు సేకరించారు. ఆపై స్కూల్‌లో పని చేసే టీచర్‌తో తహసీల్దార్‌కు పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 20 మంది విద్యార్థులకు ఈ చెట్ల వల్ల ఆటంకం ఉందని కాకమ్మ కథ అల్లి వినతిపత్రం ఇప్పించారు. సదరు తహసీల్దార్ వెంటనే పంచాయతీ కార్యదర్శికి ఎండార్స్ చేసి రిపోర్ట్ ఇవ్వమని అడిగారు. అయితే ఇక్కడే సదరు వ్యక్తులు తెలివి ఉపయోగించారు. ఆ అర్జీని సాకుగా చూపుతూ తహసీల్దార్ చెట్లు కొట్టేందుకు అనుమతి ఇచ్చారని గ్రామంలో హడావుడి చేశారు. ఎలాగూ మూడు రోజుల పాటు సెలవులు కావడంతో సదరు నేతలు పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లన్నీ నరికేశారు. గ్రామస్తులు, ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఎందుకు చెట్లను నరుకుతున్నారని అడిగితే విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని కొట్టేశామని నమ్మించారు. అయితే అడ్డంగా ఉంటే చెట్లకొమ్మలు కొట్టాలి కానీ చెట్లన్నీ ఎలా కొడతారని నిలదీశారు ?. ఈవిషయంపై సాక్షి గుడిపాల ఎంఈఓలు హసన్‌బాషా, గణపతిని వివరణ కోరగా తమకు తెలియదని చెప్పారు. తహసీల్దార్ మాత్రం తనకు అర్జీ ఇచ్చారని.. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శికి రెఫర్ చేశానన్నారు. అయితే ఆదివారం చెట్లను నరికి మొద్దులను ఐచర్ వ్యాన్‌లోకి లోడ్ చేస్తున్న విషయాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి చెప్పారు. అయితే వ్యాన్ ఆపాలని సూచించారు. అయితే కొద్దిసేపటికే ఎక్కడి నుంచి ఫోన్ వచ్చిందో కానీ కలప లోడ్‌తో ఉన్న వాహనం వెళ్లిపోయింది. ఎంతో ఆహ్లాదాన్ని పంచే వృక్షాలను ఇలా నరికేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.